క్లుప్తంగా

ఉత్సాహంగా ముగ్గుల పోటీలు



ఇందిరా గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఎస్‌ఐ శ్రీనివాసరావు

పెదగంట్యాడ: విద్యార్థులు క్రీడలపై ఆసక్తి పెంపొందించుకోవాలని న్యూపోర్టు ఎస్‌ఐ శ్రీనివాసరావు అన్నారు. గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా పెదగంట్యాడ శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు ఆదివారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో విశాఖ విమల విద్యాలయం, లైఫ్ వే, ప్రతిభా పాఠశాలలకు చెందిన విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ముందుగా మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతిని పురస్కరించుకుని ఆమె చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పెదగంట్యాడ గ్రంథాలయ శాఖాధికారి పీవీ రమణ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో రామ్, మహేష్, సురేష్, రాకేష్, వేణు పాల్గొన్నారు.

ఇందిరాగాంధీ సేవలు అజరామరం



ఇందిరాగాంధీ చిత్రపటంవద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

గాజువాక: మాజీ ప్రధాని దివంగత ఇందిరాగాంధీ భారతదేశానికి అందించిన సేవలు మరువలేనివని కాంగ్రెస్ పార్టీ గాజువాక సమన్వయకర్త గవర వెంకట రమణారావు అన్నారు. పాతగాజువాకలో ఆదివారం నిర్వహించిన ఇందిరాగాంధీ జయంతి కార్యక్రమంలో ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ ప్రపంచంలోనే ఆమె శక్తివంతమైన మహిళ అని అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

ఘన నివాళి



ఉక్కులో ఇందిరా గాంధీకి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

ఉక్కునగరం: భారత మాజీ ప్రధాని ఇందిరా గాంధీకి స్టీల్ ఐఎన్‌టీయూసీ నాయకులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా యూనియన్ నేతలు మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ ఏర్పాటుకు ఇందిరాగాంధీయే కారణమన్నారు. అమృతరావు దీక్షతో విశాఖలోనే ప్లాంట్ ఏర్పాటు చేస్తామని పార్లమెంట్‌లో హామీ ఇవ్వడంతో పాటు ఆమె చేతుల మీదుగా శంకుస్థాపన జరిగిందన్నారు. ఆమె ప్రారంభించిన ప్లాంట్‌ను నేటి బీజేపీ ప్రభుత్వం అమ్మాలని చూస్తోందన్నారు. కార్యక్రమంలో నాయకులు నీరుకొండ రామచంద్రరావు, కారు రమణ, మంత్రి గోపినారాయణ, సుదర్శన్, ఎం.దేవుడు, రాథోడ్, కోరాడ వెంకటరావు, జెర్రిపోతుల మోహన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు మ్యూజికల్ చైర్ పోటీలు

గాజువాక: గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా గాజువాక శాఖా గ్రంథాలయంలో మహిళలకు ఆదివారం మ్యూజికల్ చైర్ పోటీలను ఏర్పాటు చేశారు. అంతకుముందు మాజీ ప్రధాని ఇందిరాగాంధీకి నివాళులర్పించారు. ఈ కార్యక్రమాలను యోగా గురు లీలా దుర్గ ప్రారంభించారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి బి.చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.





చూడచక్కగా.. చదువుల కోవెల

నాడు

కొండలు.. గుట్టలు.. ముళ్ల తుప్పలు.. చాలీచాలని వసతితో సతమతమయ్యే పరిస్థితి

నేడు

కొండలు బండలు పిండయ్యాయి. విశాలమైన ఆవరణ, చూడచక్కగా భవనాల సముదాయం, అధునాతన వసతులతో తరగతి గదులు.. పిల్లలకు 'మరుగు' సౌకర్యంతో కార్పొరేట్ పాఠశాలకు దీటుగా ముస్తాబైంది 88వ వార్డు నంగినారపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల.

- కార్పొరేట్‌కు దీటుగా నంగినారపాడు ఉన్నత పాఠశాల
- రూ.కోటి 8లక్షలతో అధునాతన వసతులు
- ఆహ్లాదకర వాతావరణంలో చదువుకునేందుకు ఏర్పాట్లు

అగనంపూడి: దేశ భవిత రూపుదిద్దుకునేది తరగతి గదుల్లోనే.. అన్నదానిని దృఢంగా నమ్మిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి విద్యారంగానికి అధిక నిధులు కేటాయించి, పేద విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు చక్కని పునాదులు వేస్తున్నారు. నాడు–నేడు కార్యక్రమంలో భాగంగా పాఠశాలల్లో మంచినీరు, మరుగుదొడ్లు, వసతి లేమి లేకుండా భవనాలు నిర్మించడానికి నిధుల వరద కురిపించారు. మౌలిక వసతులకు ప్రాధాన్యమిస్తూ కార్పొరేట్‌కు దీటుగా మలిచారు. దీంతో తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలకు పంపించేందుకు ఆసక్తి కనబరుస్తున్నారు. పిల్లలు కూడా ఆహ్లాదకర వాతావరణంలో, ఉపాధ్యాయుల పర్యవేక్షణలో చక్కగా చదువుకుంటున్నారు.

పాఠశాల: నంగినారపాడు జెడ్పీ హైస్కూల్

మొత్తం నిధులు: రూ.1.08 కోట్లు

మొదటి విడత నిధులు: రూ.72 లక్షలు

రెండో విడత నిధులు: రూ.36 లక్షలు

ఉపాధ్యాయుల సంఖ్య: 16

చేపట్టిన పనులు

- తరగతి గదుల మరమ్మతులు
- అన్ని గదులకు విద్యుదీకరణ
- ఆవరణను చదును చేయడం, గ్రీనరీ
- మరుగుదొడ్లు, గ్రానైట్ ఫ్లోరింగ్
- ప్రహరీ నిర్మాణం, మంచినీటి సౌకర్యం
- మూడు అదనపు తరగతి గదుల నిర్మాణం

విద్యార్థుల సంఖ్య: 446



యూరినల్స్



తరగతి గదిలో కొత్త బెంచీలు, డెస్కులు

ఇంతలో ఎంత మార్పు



నేను 7వ తరగతి చదువుకునే. రోజుల్లో చాలీచాలని తరగతి గదుల్లో ఉండేవాళ్లం. ఇప్పుడు విశాలమైన, అందమైన గదులు, చక్కని బెంచీలు, వసతులతో మరుగుదొడ్లు నిర్మించారు. పరిశుభ్రమైన తాగునీరు అందుతోంది. పాఠశాల ఇంత తక్కువ కాలంలో ఇలా మారుతుందని ఊహించలేదు. ఇది మా బడి అని చెప్పడానికి ఎంతో ఆనందపడుతున్నాం. – **యమున**, పదవ తరగతి

జేవీకేతో భారం తగ్గింది



జగనన్న విద్యా కానుక ద్వారా మా తల్లిదండ్రులపై ఆర్థిక భారం తగ్గింది. పదివేల రూపాయల విలువైన నోట్ పుస్తకాలు, యూనిఫాం, బ్యాగ్, షూ, డిక్షనరీలను అందించారు. రోజూ గుడ్డు, చిక్కీ... అన్ని పోషక విలువలతో కూడిన జగనన్న గోరుముద్దతో రుచికరమైన భోజనం తింటున్నాం. అన్నివిధాలా సౌకర్యాలు బాగున్నాయి. – **అపర్ణ**, 7వ తరగతి

ఐఎఫ్‌పీతో ఎంతో మేలు



ఒక్కో తరగతి గదికి ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానల్ (ఐఎఫ్‌పీ) అందించడం వల్ల డిజిటల్ ప్రపంచాన్ని వీక్షిస్తున్నాం. ప్రైవేటు పాఠశాలల్లో కూడా ఇటువంటి సౌకర్యం లేదని మా గ్రామంలో అనుకుంటున్నారు. ప్రభుత్వం మా చదువు విషయంలో ఎంతో శ్రద్ధ తీసుకుంటోంది. మా చదువు విషయంలో మా తల్లిదండ్రులు కూడా ఎంతో ఆనందంగా ఉన్నారు. – **విజయ్**, పదవ తరగతి



పచ్చని లాన్‌లతో ఆవరణ

రెండు విడతలో ఎంతో అభివృద్ధి

రెండు విడతల్లో రూ.1 కోటి 08 లక్షల ప్రభుత్వ నిధులతో పాఠశాలలో ఎంతో అభివృద్ధి జరిగింది. మొదటి ఫేజ్‌లో విద్యార్థులకు కావల్సిన అన్ని వసతులు కల్పించాం. అదనపు తరగతి గదులు అవసరమని భావించి రెండో విడత కూడా నిధులు విడుదల చేశారు. నిర్మాణ పనులు సాగుతున్నాయి. – **జగదీష్**, హెచ్‌ఎం, నంగినారపాడు హైస్కూల్

సీఎం జగన్ పాలన దేశానికే ఆదర్శం

75వ వార్డులో జోరుగా ఇంటింటి ప్రచారం



75వ వార్డు నీలాపువీధిలో ఇంటింటి ప్రచారం చేస్తున్న గొందేశి శ్రీనివాస్‌రెడ్డి

పెదగంట్యాడ: రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన సంక్షేమ పాలన దేశానికే ఆదర్శంగా నిలిచిందని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు ధర్మాల శ్రీను, వైఎస్సార్ సీపీ 75వ వార్డు అధ్యక్షుడు గొందేశి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని జీవీఎంసీ 75వ వార్డు పరిధిలోని నీలాపువీధి, అయ్యన్నపాలెంలో ఆదివారం నిర్వహించారు. ఈ మేరకు వారు ఇంటింటికీ వెళ్లి నాలుగున్నరేళ్లలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను వివరించారు. కరపత్రాలను పంపిణీ చేశారు. ప్రజా సంక్షేమం కోసం అహర్నిశలు పాటుపడుతున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అండగా నిలవాలని కోరారు. వచ్చే ఎన్నికల్లో మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డికే మద్దతు పలకాలని కోరారు. ఈ కార్యక్రమంలో గొందేశి మహేశ్వరరెడ్డి, మార్టుపూడి పరదేశి, గొందేశి వెంకటరమణారెడ్డి, గొందేశి సత్యారావు, సంపంగి ఈశ్వరరావు, సుమన్‌రెడ్డి, నాగు తదితరులు పాల్గొన్నారు.

1,011వ రోజుకు ఉక్కు దీక్షలు



దీక్షలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యంలో కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద నిర్వహిస్తున్న ఉక్కు రిలే నిరాహార దీక్షలు ఆదివారం నాటికి 1,011వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షా శిబిరంలో సంస్థకు చెందిన పలు విభాగాల కార్మికులు, సంస్థకు భూములిచ్చిన నిర్వాసితులు పాల్గొని కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

ఘనంగా ఛట్ పూజలు



ఛట్ పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి

పెదగంట్యాడ: జీవీఎంసీ 76వ వార్డు పరిధి హౌసింగ్ బోర్డు కాలనీలో యువ హిందూ సాంస్కృతిక సంఘ ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఛట్ పూజా కార్యక్రమాలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఏటా కార్తీకమాసంలో వివిధ నదుల నుంచి తీసుకొచ్చిన జలాలను ఒక పెద్దగొయ్యి తవ్వి అందులో వేసి ఆ నీట్లో మహిళలు పూజలు చేయడంతో పాటు దీపాలు వదలడం ఆనవాయితీ. ఇలా చేయడం వల్ల అష్టైశ్వరాలు సిద్ధిస్తాయని నమ్మకం. పారిశ్రామిక ప్రాంతంలో ఏటా ఈ పూజా కార్యక్రమాలను నిర్వహిస్తూ ఉంటారు. ఈ పూజా కార్యక్రమాలను గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇతర ప్రాంతాల నుంచి ఇక్కడకు వలస వచ్చి అందరూ ఐక్యంగా ఉంటూ ఒక సంఘాన్ని ఏర్పాటు చేసుకుని పూజలు చేయడంపై సంతోషం వ్యక్తం చేశారు. ఈ ఆలయ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మంత్రి శంకరనారాయణ, ఉమేష్ సింగ్, జితేంద్ర వర్మ, ఉమేష్ శర్మ, రంభ నారాయణ మూర్తి, పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

సత్యసాయి జయంతి వేడుకలు ప్రారంభం



సత్యసాయి మందిరంలో ఆధ్యాత్మిక ఉపన్యాసంలో పాల్గొన్న భక్తులు



పేదలకు నిత్యావసరాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి తదితరులు

ఉక్కునగరం: స్థానిక సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం సత్యసాయి జయంతి వేడుకలు ప్రారంభమయ్యాయి. 98వ జయంతి వేడుకల్లో భాగంగా ఉక్కునగరం పరిసర ప్రాంతాల్లోని 12 గ్రామాల్లో 1000 మందికి పులిహోర ప్రసాదం అందజేశారు. అచ్యుతాపురం ప్రత్యేక విద్యార్థులకు తెల్లటి యూనిఫారాలు అందజేశారు. అంతకుముందు హనుమాన్ చాలీసా పారాయణ, విశ్వమానవ కల్యాణానికి రుద్రాభిషేకం నిర్వహించారు. ఆధ్యాత్మికవేత్త జయగౌరీ సూర్య సహస్ర నామ పూజ, దేవి వైభవం గురించి ఆధ్యాత్మిక ఉపన్యాసం చేశారు. కార్యక్రమాల్లో సమితి కన్వీనర్ జి. రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వెంపళ్లనగర్‌లో..

పెదగంట్యాడ: భగవాన్ సత్యసాయి జయంతి వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. జీవీఎంసీ 74వ వార్డు పరిధిలోని వెంపళ్లనగర్ కమ్యూనిటీ హాల్‌లో సత్యసాయి భజన మండలి ప్రతినిధి గళ్లా శంకర్‌సాయిరాం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథులుగా గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే చింతలపూడి వెంకట్రామయ్య, కార్పొరేటర్ తిప్పల వంశీరెడ్డి, న్యూపోర్టు పోలీస్‌స్టేషన్ సీఐ ఎర్రన్నాయుడు హాజరయ్యారు. ముందుగా సత్యసాయి చిత్ర పటానికి పూలమాలలు వేసి పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగిరెడ్డి మాట్లాడుతూ సత్యసాయి అంటే సేవ అని, పుట్టపర్తిలో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని గుర్తు చేశారు. దానిని స్ఫూర్తిగా తీసుకుని ఇక్కడ గళ్లా శంకర్‌సాయిరాం పేదలకు తనవంతు సేవ చేస్తున్నారని కొనియాడారు. అనంతరం పేదలకు నిత్యావసరాలు పంపిణీ చేశారు.

అవగాహన లేని ఆరోపణలు వద్దు



సమావేశంలో మాట్లాడుతున్న పరదేశి

పెదగంట్యాడ: టీడీపీ, జనసేన నాయకులు అవగాహన లేని ఆరోపణలు చేయడం సరికాదని వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మార్టుపూడి పరదేశి అన్నారు. స్థానిక బీసీ రోడ్డులోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాకతీయ జంక్షన్ నుంచి గంగవరం పోర్టు వంతెన వరకూ రోడ్డును నిర్మించాలని స్టీల్‌ప్లాంట్ అధికారులను కోరామన్నారు. త్వరలోనే ఆ పనులు చేపట్టనున్నారని తెలిపారు. ఈ సమావేశంలో పల్లా చినతల్లి, గొందేశి శ్రీనివాస్‌రెడ్డి, గొందేశి వెంకటరమణారెడ్డి, మహేశ్వరరెడ్డి, గొందేశి సత్యారావు, సంపంగి ఈశ్వరరావు, పిట్టా రెడ్డి, వెంకటేష్ పాల్గొన్నారు.

ఏఐటీయూసీ గౌరవాధ్యక్షుడికి స్వాగతం



ఏ.కె.దాస్‌కు ఘన స్వాగతం పలుకుతున్న భెల్ (హెచ్‌పీవీపీ) యునైటెడ్ ఫ్రంట్ నాయకులు

అక్కిరెడ్డిపాలెం: ఏఐటీయూసీ యునైటెడ్ ఫ్రంట్ గౌరవాధ్యక్షుడు, ఏఐటీయూసీ అఖిల భారత భెల్ ప్రధాన కార్యదర్శి ఏ.కె.దాస్, జేసీఎం మెంబర్ ఎస్.డి.వి.కృష్ణంరాజులు విశాఖ విచ్చేసిన సందర్భంగా విశాఖ విమానాశ్రయంలో భెల్ (హెచ్‌పీవీపీ) యునైటెడ్ ఫ్రంట్ నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. యునైటెడ్ ఫ్రంట్ నాయకులతో సమావేశమైన అనంతరం గెస్ట్ హౌస్‌కు తరలివెళ్లారు. కార్యక్రమంలో ఫ్రంట్ నాయకులు సుభాకర్ సాహు, కొల్లి దేముడు, బొండా బాబూరావు, పి.వి.ఎస్.రాజు, జె.రాము, ఎ.నర్సింగరావు, భాస్కరరావు, ఎం.మునిలి రెడ్డి, రవీంద్ర బాబు తదితరులు పాల్గొన్నారు.

26న రాధాకృష్ణ మహోత్సవం



సమావేశంలో సంఘీభావం తెలుపుతున్న యాదవ సంఘం నాయకులు

పెదగంట్యాడ: ఈ నెల 26న నిర్వహించనున్న రాధాకృష్ణ మహోత్సవాన్ని విజయవంతం చేయాలని విశాఖ జిల్లా యాదవ సంక్షేమ సంఘం అధ్యక్షుడు భరిణకాన రామారావు కోరారు. విశాఖ ఉక్కు యాదవ సంఘం ఆధ్వర్యంలో పెదగంట్యాడ సీడబ్ల్యూసీలో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజకీయాలకు అతీతంగా యాదవులందరూ ఈ ఉత్సవంలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. నమ్మి తాతారావు అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశంలో గొలగాని రవీశ్వరరావు, పల్లా మహేష్, బొడ్డు పైడిరాజు, నమ్మి సింహాద్రి తదితరులు పాల్గొన్నారు.

నాక్ ర్యాంక్‌పై మాజీ వీసీల హర్షం

ఏయూ క్యాంపస్: జాతీయ స్థాయిలో నాక్ గ్రేడింగ్‌లో ఏయూ అత్యుత్తమ స్థానాన్ని సాధించడంపై వైజాగ్ వైస్ చాన్సలర్స్ ఫోరం హర్షం వ్యక్తం చేసింది. ఆదివారం ఉదయం ఏయూ అకడమిక్ సెనేట్ మందిరంలో ఫోరం ఆధ్వర్యంలో ఆత్మీయ అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం పూర్వ వీసీ ఆచార్య వి.బాలమోహన్‌దాస్ మాట్లాడుతూ దేశంలోనే టాప్–3 విశ్వవిద్యాలయాల్లో ఒకటిగా ఏయూను తీర్చిదిద్దారన్నారు. ఏ ప్లస్ ప్లస్ లభించడం కంటే 3.74 సీజీపీఏ సాధించడం ఎంతో కష్టతరమని చెప్పారు. ఏయూ మాజీ వీసీ ఆచార్య జీఎస్‌ఎన్ రాజు మాట్లాడుతూ నేడు ఏయూ ఒక అమూల్య వజ్రంగా మారిందన్నారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం మాజీ వీసీ ఆచార్య నిరుపమ రాణి మాట్లాడుతూ మానవతా విలువలను మరింతగా విద్యలో అంతర్భాగం చేయాలని సూచించారు. ఆచార్య వి.ఎస్.ఆర్.కె.ప్రసాద్ మాట్లాడుతూ అన్యాక్రాంతమైన వర్సిటీ భూములను వీసీ ప్రసాదరెడ్డి కాపాడడం ప్రశంసనీయమన్నారు. వీసీ ప్రసాదరెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అందించిన సహకారం, తోడ్పాటుతో ఏయూ సమగ్ర అభివృద్ధి సాధ్యపడిందన్నారు. ఇందుకు సీఎంకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. కార్యక్రమంలో పి.డి.ఎస్.శ్రీనివాస్, ఆచార్య గంగాధరరావు, ఆచార్య జె.వి.ప్రభాకరరావు, పూర్వ ఉపకులపతులు ఆచార్య వై.సత్యనారాయణ, ఆచార్య ఆర్.సుదర్శనరావు, ఆచార్య జగన్నాథరావు, ఆచార్య వెంకట సుబ్బయ్య, ఓఎస్‌డీ వి.కృష్ణమోహన్ పాల్గొన్నారు.

డయల్ యువర్ డీపో మేనేజర్‌కు స్పందన

ఉక్కునగరం: ఆర్టీసీ స్టీల్ సిటీ డిపో ఆధ్వర్యంలో నిర్వహించిన డయల్ యువర్ డిపో మేనేజర్‌కు మంచి స్పందన లభించింది. డిపో మేనేజర్ గౌతమ్ చటర్జీ ఆదివారం ఉదయం 10.30 నుంచి 11.30 వరకు నిర్వహించిన కార్యక్రమంలో 23 మంది ఫోన్ చేసి తమ విజ్ఞప్తులు తెలియజేశారు. టౌన్‌షిప్‌నకు తిరిగే 38కె సర్వీసు బస్సులు పెంచాలని 11 మంది ఫోన్ చేశారు. టౌన్‌షిప్ నుంచి విజయనగరం, దేవరాపల్లికి బస్సులు నడపాలని ఐదుగురు , ఆర్టీసి కాంప్లెక్స్ నుంచి స్టీల్‌ప్లాంట్‌కు ఎన్ఏడీ, పాత గాజువాక, బీసీ గేటు వరకు బస్సులు వేయమని ఇద్దరు కోరారు. వడ్లపూడి నుంచి ఆర్‌కే బీచ్‌కు బస్సు కావాలని ఒకరు, దువ్వాడ రైల్వే స్టేషన్ ప్లాట్‌ఫామ్–1 వైపు బస్సు వేయమని ఇద్దరు విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతం ఒక బస్సు ఉన్న మంగళపాలెంకు బస్సులు పెంచమని ఒకరు, ఫకీర్‌తక్యాకు బస్సు సర్వీసు కల్పించాలని మరొకరు డిపో మేనేజర్‌ను కోరారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.